క్లుప్తంగా

ఎల్‌కే అద్వానీకి భారతరత్న ఇవ్వడంపై హర్షం

ఒంగోలు సెంట్రల్: దేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అద్వానీ బీజేపీ భీష్మ పితామహుడని అభివర్ణించారు.

గుర్రం జాషువా విగ్రహావిష్కరణ కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి సభ్యులు

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రకాశం భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించి శనివారం గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి నిర్వాహకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ సాయంత్రం జాషువా కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమితి సభ్యులు ఎండ్లూరి రవికుమార్, అంగలకుర్తి ప్రసాద్, షాలీమ్‌రాజ్, గరటయ్య, మాధవ, చిరంజీవి, త్రిపుర తదితరులు కరపత్రం విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీసీ రోడ్లతో ఎంతో సౌకర్యం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

- ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు సబర్బన్: సీసీ రోడ్ల నిర్మాణంతో ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని కొత్తపట్నం రోడ్డులో రైల్వే ఫ్లై ఓవర్ పక్కన 6వ డివిజన్‌లోని ఇందుర్తి నగర్‌లో ముస్లిం శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఎంపీ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.10 లక్షలను మాగుంట కేటాయించారు. పూర్తయిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, స్థానిక కార్పొరేటర్, ఇతర ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు విస్తృతంగా సేవలందించాలి

- సచివాలయాల సిబ్బందితో మేయర్ గంగాడ సుజాత
- 39వ డివిజన్ సమతానగర్‌లో వార్డు సచివాలయం ఆకస్మిక తనిఖీ



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: వార్డు సచివాలయాల సిబ్బంది ప్రజలకు విస్తృతంగా సేవలందించాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఆదేశించారు. నగరంలోని 39వ డివిజన్ సమతానగర్‌లో వార్డు సచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. తొలుత హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు ఎలా ఉంది, వారు ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారనే దానిపై వారినే అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రధానంగా రెవెన్యూ కలెక్షన్ ఏ విధంగా ఉందని అడ్మిన్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బర్త్, డెత్ సర్టిఫికెట్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నుల వసూలు, పెన్షన్ పంపిణీ లాంటి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రేషన్ అందించడంలో సమయ పాలన పాటించాలన్నారు. రేషన్ పంపిణీ విషయంలో కొన్ని సమస్యలున్నాయని, పరిష్కరించాలని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, మున్సిపల్ మేనేజర్ శ్రీహరి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.నటరాజ్ కుమార్

ఉలవపాడు: సమాజంలోని ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.నటరాజ్ కుమార్ సూచించారు. ఉలవపాడులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల విద్యార్థులు శనివారం రాత్రి నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలు ప్రతి మనిషికి అండగా ఉంటాయన్నారు. అధ్యక్షత వహించిన అదనపు విశ్రాంత ఎస్సీ, ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల అధ్యాపకుడు సుంకర సాయిబాబు న్యాయ సేవలు ఎలా పొందాలో వివరించారు. అనంతరం న్యాయ కళాశాల విద్యార్థులు వివాహ చట్టం, చిన్న పిల్లలపై లైంగిక దాడులు, వినియోగదారుల రక్షణ చట్టం, అవయవ మార్పిడి, భరణం కేసులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖాధికారులు పి.రమణయ్య, ప్రసాద్‌రావు, మండల డీటీ వి.వీరయ్య, న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆళ్ల హరిబాబు, అధ్యాపకుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ క్రికెట్‌లో మైనంపాడు జట్టుకు సిల్వర్ మెడల్



సిల్వర్ మెడల్ సాధించిన మైనంపాడు క్రికెట్ జట్టు

చీమకుర్తి: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి ఆటల పోటీల్లో సంతనూతలపాడు మండలం మైనంపాడు డైట్ కాలేజీకి చెందిన మహిళా క్రికెట్ జట్టు క్రికెట్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పీఈటీ రవికుమార్ తెలిపారు. కోచ్ రవి కుమార్, క్రీడాకారిణులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరులో 50 మంది వృద్ధులకు ప్రకాశం జిల్లా మాదిగ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. మాదిగ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీడీవో

కొత్తపట్నం: నూతన ఎంపీడీవోగా ఆర్.ఫణికుమార్‌నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా గురజాడ నుంచి బదిలీపై ఆయన వచ్చారు. ఇక్కడ పనిచేసిన పి.సుజాత నెల్లూరు జిల్లా కొండాపురం మండలానికి బదిలీపై వెళ్లారు.

పోస్టాఫీస్ సేవలపై విద్యార్థులకు అవగాహన

చీమకుర్తి: పోస్టాఫీస్‌లో అందుబాటులో ఉండే సేవలపై పోస్ట్‌మాస్టర్ కే రామారావు శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. చీమకుర్తిలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూలుకు చెందిన విద్యార్థులు స్థానిక పోస్టాఫీస్‌ను సందర్శించారు. పోస్టాఫీస్‌లో మనీ ఆర్డర్, లెటర్ బుకింగ్, సేవింగ్స్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్లు వంటి పలు రకాల సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోస్టాఫీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయం కూడా దేవాలయం లాంటిదే

ఒంగోలు టౌన్: మన గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సిబ్బంది సేవలందించారు. గ్రంథాలయ పరిసరాలు, ర్యాకులు, కంప్యూటర్ విభాగంలోని కంప్యూటర్లు, పుస్తకాలను శుభ్రం చేసి చక్కగా అమర్చారు. ఈ సందర్భంగా ఉపగ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ గ్రంథాలయం కూడా దేవాలయం లాంటిదేనని, ఇక్కడి పుస్తకాలు మనుషుల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నారు. ఎంతో మంది మనుషులను మహనీయులుగా మార్చిన ఘనత పుస్తకాలకు ఉందన్నారు. నగరంలోని ప్రజలు గ్రంథాలయ అభివృద్ధిలో భాగం కావాలని, సామాజిక సేవలో భాగంగా గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, డి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.